క్లుప్తంగా

వైద్యుడికి స్వాగతం



సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ హరిప్రసాద్‌ను శుక్రవారం కేశోరాం అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు స్వాగతం పలికారు. దాదాపు రెండేళ్లుగా స్థానిక ఈఎస్ఐ ఆసుపత్రిలో డాక్టర్ లేక కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఇటీవల కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో ఈఎస్ఐ మేనేజర్ ఖగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించి వైద్యుడిని నియమించాలని కోరారు. ఎట్టకేలకు ఈఎస్ఐ ఆసుపత్రికి వైద్యుడు రావడంతో ఆయనను సత్కరించారు. ఇందుకు సహకరించిన ఎన్టీపీసీ ఈఎస్ఐ మేనేజర్ ఖగేశ్వరరావుతో పాటు డాక్టర్ హరిప్రసాద్‌ను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, నాయకులు బత్తిని సతీశ్‌గౌడ్, ములకనూరి శ్రీధర్, కొమ్ము శ్రీనివాస్, సదవేన రాజయ్య, గొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజీవ్‌తండాలో కార్డెన్ సెర్చ్



మాట్లాడుతున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌తండాలో శుక్రవారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్సై స్వామి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తండాలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్తిస్థాయిలో పత్రాలు లేని 20 బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం ఎస్సై స్వామి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైభవంగా శేషవాహన సేవ

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి తిరుకళ్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో శేషవాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భాగవతచరణురేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడి సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపుతో పిల్లల్లో ఉల్లాసం



క్యాంపులో విద్యార్థులు

ముత్తారం: సమ్మర్ క్యాంపులతో పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని మండల ఇన్‌చార్జి విద్యాధికారి హరిప్రసాద్ అన్నారు. మండలంలోని జిల్లాలపల్లి, ఓడేడ్, ఖమ్మంపల్లి, అడవిశ్రీరాంపూర్, పారుపల్లి, కేశనపల్లిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులకు పిల్లలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారని ఆయన తెలిపారు. పారుపల్లిలో గురుకులంలో ప్రతిభ చాటిన పిల్లలకు పరీక్ష ప్యాడ్, జామెట్రీ బాక్సులు అందచేసినట్లు ఎంఈవో చెప్పారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చట్టరీత్యా చర్యలు

ఓదెల: మండలంలోని ప్రధానరోడ్లపై రైతులు ధాన్యం ఆరబోస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ శుక్రవారం తెలిపారు. రైతులు ఇటీవల పండించిన వరి, మొక్కజొన్న ధాన్యం ఆరబెట్టడం కోసం రోడ్లపై పోయొద్దని సూచించారు. మండలంలో ముఖ్యంగా గుంపుల నుంచి గుండ్లపల్లి వరకు, కొలనూర్ టూ ఓదెల వరకు రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ధాన్యం రోడ్లపై ఆరబోసే రైతులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా ఉత్తర నక్షత్ర పడిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం రాత్రి ఉత్తర నక్షత్ర పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవ్ ప్రకాశ్ పాండే ఉదయం అయ్యప్పస్వామి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు





ఓదెల ఐకేపీ సెంటర్‌లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

- 20రోజులుగా కాంటా పెట్టకపోవడంతో అరిగోస పడుతున్న అన్నదాతలు
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి

ఓదెల: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించడం కోసం ఐకేపీ సెంటర్‌లోకి తీసుకొచ్చిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఓదెల ఐకేపీ సెంటర్‌లో కొనుగోళ్లు జరపకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. రైతులు 20రోజుల నుంచి జాగారం చేస్తున్నారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ ప్రారంభించి నెలరోజులు గడిచినా నేటికీ లారీల కొరత, సిబ్బంది జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మాయిశ్చర్ రాలేదనే సాకుతో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మాయిశ్చర్ రాలేదని గోనె సంచులు ఇవ్వక, మరోవైపు లారీలు రావడం లేదని సిబ్బంది చెప్తున్నారని రైతులు వాపోతున్నారు.

20రోజులుగా ఎదురుచూపులు..

ఓదెల ఐకేపీ సెంటర్‌కు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు ధాన్యం తీసుకువచ్చి విక్రయిస్తారు. అయితే 20రోజులుగా ధాన్యం కాంటా వేయకపోవటంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. మరోవైపు సన్నరకం ధాన్యం కొనుగోలుకు ఇంకా స్పష్టత లేకుండా పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఆర్ఎంవో డాక్టర్ రాజు

కోల్‌సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని గోదావరిఖని జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంవో డాక్టర్ రాజు అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ ఆఫీసర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీజీహెచ్ ఆస్పత్రిలోని బ్లడ్ సెంటర్‌లో శుక్రవారం నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ ప్రారంభించగా, ఆర్ఎంవో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే 8 మంది నర్సింగ్ ఆఫీసర్లతోపాటు మరో ముగ్గురు వ్యక్తులు కూడా శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సూపరింటెండెంట్, ఆర్ఎంవో మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడి, ప్రతీఒక్కరు ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన నర్సింగ్ ఆఫీసర్ల అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ మగ్దలీన, సౌందర్య, నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలు పావని, ఆర్గనైజింగ్ సెక్రటరీ సునితారాణి, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, నర్సింగ్ ఆఫీసర్లు మహేశ్, రాజేశ్, సాయికిరణ్, చక్రవర్తి, సంధ్య, సుమలత, సరిత, సంపూర్ణ, సురేఖ, లక్ష్మీప్రసన్న, జ్యోత్స్న, దేవి, అనూష పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన



రామగుండం: మాట్లాడుతున్న ఎంఈవో ఏకాంబరం



ఫెర్టిలైజర్‌సిటీ: ర్యాలీలో హెచ్ఎం విమల

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ విద్యాబోధన, అర్హత కలిగిన బోధనా సిబ్బంది కలిగి ఉంటుందని మండల విద్యాధికారి ఏకాంబరం అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పేరెంట్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌళిక సదుపాయాల కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల విడుదలపైన పదో తరగతి ఫలితాల్లో ప్రయివేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. పాఠశాల హెచ్ఎం.జొన్నల రవీందర్, ఉపాధ్యాయులు కవితాదేవి, వేసవి శిక్షణ వలంటీర్ బి.సరిత, ఆశావర్కర్ కవిత, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ..

ఫెర్టిలైజర్‌సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని హెచ్ఎం విమల అన్నారు. పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లి గేట్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలపై ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో తరగతులు, డిజిటల్ బోధన, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సభ్యులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• కాపర్ వైర్ స్వాధీనం

గోదావరిఖని: ఓసీపీ–3 క్వారీలో కేబుల్ కత్తిరించి ఎత్తుకెళ్లి విక్రయించిన షాప్‌పై సెక్యూరిటీ సిబ్బంది ఆకస్మిక దాడిచేసి 96కిలోల కాపర్ వైర్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్ తెలిపారు. షిఫ్ట్ జమేదార్ మజీద్, ఇంటిలిజెన్స్ గార్డ్ ఎండీ మహబూబ్ అలీ, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ పిడుగు సతీశ్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సాయితేజ మూకుమ్మడిగా దాడి చేసి దొంగిలించిన కాపర్‌వైర్, ఇద్దరు దొంగలు, స్క్రాప్ కొనుగోలు చేసిన వ్యక్తికి చెందిన స్కూటీ, ఆటోతో సహా డ్రైవర్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న కాపర్, ఆటో, స్కూటీతో పాటు నిందితులను గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

• ఆపరేషన్ సిందూర్‌పై సంబరాలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ముస్లిం యువకులు ఆపరేషన్ సిందూర్‌పై శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. జాతీయ జెండాతో జై భారత్, జైహింద్ నినాదాలు చేశారు. మహ్మద్ రఫీక్, షేక్ బాబర్, అబ్దుల్ నవీద్, నసీఫ్, నయీమ్ పాల్గొన్నారు.

• అదుపు తప్పిన బైక్.. ఇద్దరికి గాయాలు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీలోని రంగయ్యపల్లి ప్రధాన రోడ్డుపై శుక్రవారం ఓ బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన శత్రువేదుల శ్రావన్, అతని సోదరుడు శశిధర్ కలిసి భూపాలపల్లికి తమ బైక్‌పై వెళ్తుండగా రంగయ్యపల్లి మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు టేకు చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. శ్రావణ్‌కు తీవ్ర గాయాలవగా, శశిధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో మంథనికి తరలించారు.

శానగొండ శివారులో..

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శానగొండ గ్రామానికి చెందిన మర్రిశెట్టి సంపత్ అనే వ్యక్తి బైక్ మీద నుంచి అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం సంపత్ తనబైక్‌పై జమ్మికుంటకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు శానగొండ శివారులో అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్సకోసం జమ్మికుంట ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు.

• ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ముత్తారం: ముత్తారానికి చెందిన మిడిదొడ్డి వెంకటేశ్(34) శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చెప్పిన వివరాల ప్రకారం.. మృతుడు మద్యానికి బానిసై కొంతకాలంగా మానసికంగా బాగాలేక మెడిసిన్ వాడుతున్నారు. కులవృత్తి మంగలి పని చేసుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ ఇంట్లో గొడవ పడేవాడు. మద్యం తాగి అప్పుడప్పుడూ ఇంట్లో గొడవ చేస్తూ, కేకలు పెడతాడు. శుక్రవారం సాయంత్రం కూడా ఇంట్లో గదిలో గొడవ చేసి కేకలు వేసినా సాధారణమని అనుకున్న కుటుంబ సభ్యులు పట్టించుకోలేదు. కొద్ది సేపటికి గదిలోకి వెళ్లి చూడగా వెంకటేశ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని చనిపోయి కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంకా మృతుడి కుటుంబ సభ్యులు నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై నరేశ్ తెలిపారు.

• పోలీస్ సిబ్బందికి యూనిఫాం

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి శుక్రవారం ఎస్సై స్వామి యూనిఫాం పంపిణీ చేశారు. పోలీసుల సంక్షేమంలో భాగంగా పోలీసు సిబ్బందికి విధులలో ప్రోత్సాహం అందించేందుకు గాను యూనిఫాం అందజేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విలీన సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: భూపాలపల్లిలో ఈనెల 11న నిర్వహించనున్న రెండు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్‌ల విలీన సభను విజయవతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసభలో అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లింగయ్య, రాజేశ్వరి, నాగరాజు, స్వామి, మధునయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని రంగంపల్లి, గుండంకట్ట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పెద్దకల్వల, పెద్దబొంకూర్, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దపల్లి, చందపల్లిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రాజ్‌కుమార్ తెలిపారు. మరమ్మతు పనుల కారణంగా ఉదయం 7గంటల నుంచి 9:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అంతర్గాం మండల పరిధిలో..

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి సబ్‌స్టేషన్ పునరుద్ధరణ పనులతో పాటు విద్యుత్ తీగల కింద పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు పనులను చేపట్టనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏఈ ఆశ శంకర్ తెలిపారు. శనివారం సబ్‌స్టేషన్ పరిధిలోని సుమారు పది గ్రామాలకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇందిరమ్మకాలనీ పరిధిలో..

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ రమేశ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్, అన్నపూర్ణకాలనీ, న్యూపీకేఆర్ కాలనీ, మేడిపల్లి గ్రామాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్, కొత్తపల్లి, పాలకుర్తి గ్రామాల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ వేణు సందర్శించారు. కేంద్రాల్లో కొనుగోళ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు.

కనపర్తి సురేశ్‌కు డాక్టరేట్

సుల్తానాబాద్: కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మైనార్టీ గురుకులాల సొసైటీ రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ కనపర్తి సురేశ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. కనపర్తి సురేశ్ హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 'అమితవ్ ఘోష్ ఎంపిక చేసిన నవలలో థీమాటిక్ స్టడీ' అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మెలిస్సా హెలెన్ పర్యవేక్షణలో ఆంగ్ల సాహిత్యంలో పీహెచ్‌డీ చేశారు. ఈ పరిశోధనకు సంబంధించి ఆయనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

పెద్దపల్లిరూరల్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్‌నేరాలతో అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్సై లావణ్య సూచించారు. పెద్దపల్లిలోని శాంతినగర్‌లో ఓ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్, సైబర్‌మోసాలకు గురైతే సత్వరమే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం షీటీం బృందాలు పనిచేస్తున్నాయన్నారు. మహిళలు వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సభ్యులు స్నేహలత, మౌనిక, సురేశ్, హరీశ్ ఉన్నారు.



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్ ఆవరణలో గల బోర్‌వెల్ కొంతకాలంగా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం సెలవుల సమయంలోనైనా ఈ బోరుబావికి మరమ్మతు చేయించి వినియోగంలోకి తెచ్చేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫోటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

జీడీకే–5 ఓసీపీ ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీని ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓసీపీ క్వారీలోకి వెళ్లి పనులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. బొగ్గు వెలికితీయడం, ఓవర్ బర్డన్ పని స్థలాలను తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను పర్యవేక్షించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఇంజినీర్ రమేశ్, మేనేజర్ రమేశ్‌బాబు, అనిల్‌గబాలే, సేఫ్టీ అధికారి పానుగోటి శ్రీనివాస్, సర్వేయర్ దీటి చంద్రమౌళి ఉన్నారు.

సింగరేణి పాఠశాలలో మోడల్ పాలిసెట్



మోడల్ పాలిసెట్ రాస్తున్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో శుక్రవారం మోడల్ పాలిసెట్ పరీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 10న ఆర్జీ–2 యాజమాన్యం ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల పిల్లలతో పాటు సింగరేణి ప్రభావిత గ్రామాల విద్యార్థుల కోసం సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో ఉచిత పాలిసెట్ శిక్షణను ఆర్జీ–2 జీఎం వెంకటయ్య ప్రారంభించారు. నెలరోజుల నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా కోచింగ్ తీసుకున్న 100 మంది విద్యార్థులకు ఓఎంఆర్ పద్ధతిలో మోడల్ పాలిసెట్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం పర్సనల్ అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ మాట్లాడారు. వంద మందికి పైగా శిక్షణ పొంది వారి నైపుణ్యం మెరుగుపరుచుకున్నారని పేర్కొన్నారు. ఈనెల 13న నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షకు ఈ మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందని పాఠశాల హెచ్ఎం సుందర్‌రావు తెలిపారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న చిలుక శంకర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లో విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ డిమాండ్ చేశారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని ప్రధాన దుకాణ సముదాయంలో టౌన్‌సిప్ కన్జర్వెన్సీ విభాగాల్లోని నాలుగు జోన్లలో పనిచేస్తున్న దాదాపు 100 మంది మహిళలు, పురుష కార్మికులు 35ఏళ్ల నుంచి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. జోన్లలో కొత్త టెండర్‌లలో కార్మికులను తగ్గించి చూపించడంతో మిగతా కార్మికుల పరిస్థితి అయోమయ పరిస్థితిలో ఉందన్నారు. కొంతమంది కార్మికులను తొలగించడంతో వారు మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. 2022లో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ప్రకారం రూ.1020లు 16 నెలల నుంచి కార్మికులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. 16 నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం లోపు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే టూల్ డౌన్ సమ్మె చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి బి.బుచ్చన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పుట్టపాక స్వామి, రవి, కృష్ణ, మొండయ్య, ఓదెలు, నర్సయ్య, రమేశ్, రాయమల్లమ్మ, సూరమ్మ, ఓదెమ్మ, హైమావతి, పద్మ, స్వరూప, సంధ్య పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సమాయత్తం కండి



పెద్దపల్లిరూరల్: మాట్లాడుతున్న యాకయ్య

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సమాయత్తం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య పిలుపునిచ్చారు. పెద్దపల్లిలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సంఘటిత, అసంఘటిత కార్మికులతో పాటు ప్రభుత్వ రంగసంస్థల కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ముత్యంరావు, కల్లెపల్లి అశోక్, సీపెల్లి రవీందర్, ప్రశాంత్, శ్రావణ్, నవీన్, సందీప్, సూరజ్ ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి

గోదావరిఖని: దేశవ్యాప్త సమ్మెలో పెట్రోల్ బంక్ కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి కోరారు. పెట్రోల్ బంక్ యజమానులను శుక్రవారం కలిసి సీఐటీయూ గోదావరిఖని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. మే 20న నిర్వహించే సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి మేదరి సారయ్య ఉన్నారు.